క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మారేడుమిల్లి: మండలంలోని అన్ని పంచాయతీ పరిధిలో జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రంపచోడవరం ఈఈ యూసఫ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



డి.వెలమలకోట గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో అధికారులు, రైతులు

మారేడుమిల్లి : మండలంలోని డి.వెలమల కోట గ్రామంలో వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో గురువారం పోలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని 100 లీటర్లు జిల్లేడు ద్రావణం తయారు చేసే విధానం రైతులుకు నేర్పించారు. పోటాస్ మరియు సూక్ష్మ పోషకాలు ఏర్పడి పంట ఎదుగుదలకు గింజ బరువు, నాణ్యతకు పెరుగుతుందని తదితర ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ పంటసాగుకు ముందుగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. ఏవో వెంకటేశ్వర్లు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

సాయిబాబా జన్మదిన వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

సీలేరు: సీలేరులో స్థానిక షిరిడీ సాయి ఆలయంలో షిరిడీ సాయిబాబా జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకలు శనివారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతాయని, ప్రతీరోజు ఉదయం నగర సంకీర్తన జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 28న తాత్కాలిక ధుని, పంచామృతాభిషేకం, 30న ఉదయం శ్రీ సాయి సత్యవ్రతములు, సాయంత్రం ఊరేగింపు మహోత్సవం , అక్టోబర్ 2న ఆలయ సన్నిధానంలో అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నారు.

65 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నేల పంచాయతీ లక్క గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 65 మందికి వైద్య పరీక్షలు చేశారు. రాష్ట్ర నేర నిరోధక సంఘం మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో విశాఖపట్న ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. 16 మందికి కంటి సంబంధిత ఆపరేషన్లుక, 13 మందికి కళ్లద్దాల కోసం ఎంపిక చేశారు. హెచ్‌ఆర్‌సీపీ ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ కో–ఆర్డినేటర్ కె.రవీంద్ర, పీహెచ్‌ఎన్ రత్నం, ఎంఎల్‌హెచ్‌పీ బాలకృష్ణ ఏఎన్‌ఎంలు భానుమతి, జగదీష్, రాకేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతం



అరకులోయ ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది, అరకు–పాడేరు ప్రధాన రహదారి అంబేడ్కర్ జంక్షన్‌లో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వాహనాలు రద్దీతో పాటు ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడం, రహదారిపైనే ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలువురు చెబుతున్నారు. గంటల తరబడి వాహనాలు ప్రధాన రహదారిలోనే నిలిచిపోతున్నాయంటున్నారు. స్థానిక పోలీసులు ట్రాఫిక్ నియంత్రించేందుకు ఎటువంటి ముందస్తు చర్యలు చేపటకపోవడంతో వాహనాదారులు, పాదచారలు ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సామ సాగు.. లాభాలు బాగు

- గణనీయంగా పెరిగిన ధర
- ఆశాజనకంగా దిగుబడి



సామ బియ్యం



గన్నెల గ్రామ సమీపంలో సామ పంట



బి. గంగగుడ్డి గ్రామంలో సామ పంట కోతలు చేస్తున్న రైతులు

అరకులోయటౌన్: చిరుధాన్యాలలో ఒకటైన సామకు ప్రస్తుతం మంచి గిరాకీ పెరిగింది. జొన్నలు, కొర్రలు, రాగులు, ఇతర చిరుదాన్యాల కంటె సామకు మంచి ఆదరణ లభిస్తుంది. దీంతో గిరిరైతులు ఎక్కువగా సామ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది కిలో సామ ధర రూ. 20 ఉంటే ఈ ఏడాది కిలో సామ రూ.40కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంత వ్యాపారులు మాత్రమే సామ కోనుగోలు చేసేవారు. ఈ ఏడాది ఒడిశా రాష్ట్రం నుంచి వ్యాపారులు ఈ ప్రాంత వారపు సంతలకు వచ్చి కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. దీంతో సామ రేటు పెరిగిందంటున్నారు. గతంలో సామ పంట వేసిన రైతులకు లాభం అంతమాత్రంగానే ఉండేది. కానీ ఈ ఏడాది రేటు రెట్టింపు కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సామ పంటకు ఎటువంటి ఎరువులు వేయాల్సిన అవసరం లేదు. అలాగే కలుపు తీయాల్సిన పని లేదు. పెట్టుబడి తక్కువ – ఆదాయం ఎక్కువ అందుకు గిరిరైతులు సామ పంట సాగుకు ఎక్కువగా ఆశక్తి చూపుతారు. ఒడిశా రాష్ట్రం పూరి పరిసర ప్రాంతంలో సామ బియ్యానికి మంచి గిరాకీ ఉందని చెబుతున్నారు. ఇక్కడ కిలో సామ బియ్యం రూ. 100 నుంచి రూ.120కు విక్రయిస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. చిరుధాన్యాల విక్రయానికి మారుపేరు వారపు సంతలు. ఈ సంతల్లో కిలో సామ బియ్యం రూ. 100 పైమాటే. ఈ ప్రాంత వాసులతోపాటు పర్యాటకులు సైతం చిరుధాన్యాలైన సామ, కొర్ర బియ్యం, రాగులు పిండి, జొన్నలు కొనుగోలుకు ఆసక్తి చూపుతుంటారు. ఒడిశా రాష్ట్ర వ్యాపారులు చిరుదాన్యాలను వారపు సంతకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు.

సాగుపై ఆసక్తి



అరకులోయ మండల పరిధిలో ఈ ఏడాది 2,220 ఎకరాల్లో గిరిరైతులు సామ పంట సాగు చేపట్టారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో పంట ఆశాజనకంగా ఉంది. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ వచ్చే పంట ఏదైనా ఉందంటే సామ పంట ఒక్కటే. అందుకే గిరిరైతులు ఈ సాగుకు ఆశక్తి చూపుతారు.

– ఫణిరాజ్ వర్మ, ఏవో, అరకులోయ

ధరలు బాగున్నాయి



ఈ ఏడాది సుమారు రెండు ఎకరాల్లో సామ సాగు చేపట్టాను. వర్షా లు అనుకూలించడంతో పంట బాగుంది. దిగుబడి బాగుంటుందని ఆశిస్తున్నాను. ఈ ఏడాది రేటు కూడ బాగుంది. లాభాలొచ్చే అవకాశం ఉంది.

– కొర్రా సొన్ను, రైతు, బి. గంగగుడ్డి గ్రామం, అరకులోయ

సామ బియ్యానికి గిరాకీ

తాము గ్రామాల్లో, వారపు సంతల్లో సామలు కొనుగోలు చేస్తుంటాము.. ఒడిశా రాష్ట్రం వ్యాపారులు ఇక్కడికి వచ్చి వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్తారు. ఒడిశా రాష్ట్రం పూరి ప్రాంతంలో సామ బియ్యానికి మంచి గిరాకీ ఉందని అక్కడి వ్యాపారులు చెబుతున్నారు.

– అవేష్, వ్యాపారి, కొత్తభల్లుగుడ, అరకులోయ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

పెదబయలు: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జి.మాడుగుల సీఐ వెంకటరావు అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఇటీవల పెదబయలులో ఉపాధ్యాయుల మధ్య జరిగిన గొడవ, సామాజిక వర్గాలుగా ఒకరిపై పరస్పర భౌతిక దాడులు చేసుకోవడం సరైనది కాదన్నారు. ఇకపై ఇటువంటి ఘటనలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో స్నేహపూర్వక, శాంతి వాతావరణం ఏర్పడడానికి అందరూ సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు చేయవద్దన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకుని రావాలని, తమ వంతు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మంచి సమాజం నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకమన్నారు.అనంతరం సీఐ ఆధ్వర్యంలో పెదబయలులో వాహన తనిఖీలు చేపట్టారు. పెదబయలు ఎస్ఐ రమణ తదితరులున్నారు.

గంజాయితో జీవితాలు నాశనం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ ఉషాశ్రీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి

అరకులోయటౌన్: విద్యార్థులందరూ జ్ఞాన సముపార్జనకు ప్రాధాన్యత ఇవ్వాలని పాడేరు డీఎస్పీ ఉషాశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ ఆధ్యక్షతన గంజాయి అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ఉషాశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు గంజాయి వలన జరిగే అనర్థాలను వివరించారు. గంజాయి , ఇతర మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. జీవితాన్ని మంచి మార్గాల్లో నడుచుకొని బంగారు బాటలు వేసుకోవాలన్నారు. సిఐ ఎల్.హిమగిరి మాట్లాడుతూ గంజాయి జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో పసుపులేటి నాగబాబు మాట్లాడుతూ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ హిమగిరి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మండలంలో సుంకరమెట్ట చెక్ పోస్టు వద్ద సీఐ హిమగిరి ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ముంచే ప్రభుత్వం



పద్మారావు

ముంచంగిపుట్టు: వంద రోజుల పాలనలో ప్రజలను ముంచేలా కూటమి ప్రభుత్వం పనిచేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేస్తుందని, సూపర్ సిక్స్ అమలు చేయలేక, ఎటువంటి సంక్షేమం పథకాలు అమలు జరగకాక ప్రజలు మోసపోయారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, సంక్షేమ పాలనను అందించారని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడ జరగని పాలనను జగనన్న అందించారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు మాటల పాలనను ఆపి చేతల పాలనను చేయాలని, ప్రజలకు సంక్షేమ పథకాలు హామీలు అమలు చేయాలని ఆయన సూచించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా విశ్వేశ్వరరాజు నియామకంపై హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, నాయకులు

పాడేరు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడంపై పార్టీ క్యాడర్ హర్షం వ్యక్తం చేస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం లోచలిపుట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన సారథ్యంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ క్యాడర్ అంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేసి జిల్లాలో అత్యధిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు స్థానాలను కై వసం చేసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించడంతో పాటు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలిగా, పీఏసీ కమిటీ సభ్యుడిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, కిముడుపల్లి ఎంపీటీసీ సభ్యుడు రామారావు, కిండంగి మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ, నాయకులు రాజేష్, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు చేయాలి



కోతకు గురైన మట్టిరోడ్డును చూపిస్తున్న సర్పంచ్ వెంకటరావు, గ్రామస్తులు

డుంబ్రిగుడ: మండలంలోని బోడ్డుగుడ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు కోట్టుకుపోవడంతో ఆ ప్రదేశంలో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మించాలని సర్పంచ్ వంతాల వెంకటరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం బోడ్డుగుడ గ్రామంలో సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంటసీమ జంక్షన్ నుంచి బోడ్డుగుడ మీదుగా జంగిడివలసలో బయలుదేరే ఆ రహదారిలో ఆటోలు, ద్విచక్ర వాహనలతో నిత్య రద్దీగా ఉంటుందని చెప్పారు. ఈ రోడ్డులో కోతకు గురికావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వెంకటరావు కోరారు. బోడ్డుగుడ గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి



గడుతూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ, సూపర్‌వైజర్లు




చౌడుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంతో పోషక ఆహార పదార్థాల ప్రదర్శన

జి.మాడుగుల: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలో సొలభం, గడుతూరు సెక్టారులలో గల సచివాలయాల్లో గురవారం పోషకాహారం ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సీడీపీవో సువర్ణమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఏడు నెలలు నుండి మూడేళ్ల లోపు పిల్లలు తీసుకోవలసిన పోషకాహారం, జాగ్రత్తలను వివరించారు. సామూహిక సీమంతం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ అప్పలమ్మ, సూపర్‌వైజర్లు లక్ష్మి, మణికుమారి, ఎం లక్ష్మీ, సత్యవతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం సెక్టార్ పరిధిలోని లూసం, చౌడుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీసీ సీడీపీవో విజయకుమారి సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసుకు తగిన విధంగా పిల్లల ఎత్తు, బరువు ఉండాలన్నారు. ప్రతీ అంగన్వాడీ కార్యకర్త విధిగా బరుతు, ఎత్తు కొలతలు తీసి రికార్డుల్ల నమోదు చేయాలని సూచించారు.రక్తహీనత లేకుండా చూసుకోవాలని కోరారు. సామూహిక సీమంతం నిర్వహించారు. పోషణ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి అవసరమైన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన భవన్‌లో గురువారం అరకులోయ, డుంబ్రిగుడ అంగన్‌వాడీ కార్యక్తలు, హెల్పర్లతో అంగన్‌వాడీల వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రలుగా మార్పు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో సరకులను ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉమామహేశ్వరరావు, నాగమ్మ, కళావతి, కొండమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రోగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వినయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తెలిపారు, మండల కేంద్రం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం పార్టీ శ్రేణులతో పర్యటించారు. రోగులకు అందుతున్న వైద్య సౌకార్యలపై ఆరా తీశారు, వార్డులో సందర్శించి రోగులతో వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలి వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. వైద్యధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో వైద్య సేవలు అందించాలన్నారు. రోగులకు వ్యాధులపై తీసుకోవల్సిన జాగ్రతలపై చైతన్యం కల్పించాలన్నారు. ఆస్పత్రుల్లో చేరే ప్రతి రోగికు వైద్యులతో పాటు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నర్సింహమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, సర్పంచ్ భాస్కర్‌రావు, నాయకులు గోపాల్, రమేష్, బాలు, రామారావు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం: మండల ఎగువప్రాంత అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు, పాలు, తదితర పౌష్టికాహారాలు సక్రమంగా అందడం లేదని ఐసీడీఎస్ అధికారులను ఎంపీపీ కడబాల ఆనందరావు నిలదీశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకట లక్ష్మీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ విద్యుత్ తీగలతో అడవి జంతువుల వేటాడుతూ ప్రజల మృతికి కారణమవుతున్న వారిపైన, అనుమతి లేకుండా విద్యుత్ తీగల కిందనే ఇల్లు కట్టేవారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులపై ధ్వజమెత్తారు. వై.రామవరం నుంచి యార్లగడ్డ గ్రామం మీదుగా మఠంభీమవరం, గుర్తేడు రోడ్డు నిర్మాణానికి తక్షణమే అనుమతులు ఇవ్వాలని అటవీశాఖ అధికారులను నిలదీశారు. మండలంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులతోను ముఖాముఖీ చర్చించి, పరిష్కార మార్గం ఏర్పాటు చేయమని ఆయా శాఖల అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కె.బాపన్నదొర మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోతే కలెక్టర్‌కు రిపోర్టు పంపిస్తామని హెచ్చరించారు. నీతి అయోగ్, ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాలను సంబంధిత అధికారులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీలు వీరమళ్ళ సుబ్బలక్ష్మీ, కరక వెంకటరమణ, సర్పంచ్‌లు, తహసీల్దార్ కె.అనుసూయ, ఈవోపీఆర్‌డీ డి.శివకుమార్, ఎంఈవో కె.తాతబ్బాయిదొర, ఏపీఓ సాయిబాబా, ఏఓ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు, తదితర శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యభద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రాష్ట్రీయ స్వస్థ్య కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థినులకు ఉమెన్ ఎన్‌పవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వస్థ్య కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ రక్తహీనత బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఉమెన్ ఎన్‌పవర్మెంట్ సెల్ కన్వీనర్ పి.సుందరిరాణి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. మాడగడ పీహెచ్‌సీ హెచ్ ఎస్. పావని మాట్లాడుతూ పరిశుభ్రత, వ్యక్తిగత భాగాల ఇన్‌ఫెక్షన్, లైంగిక వేధింపు, పౌష్టికాహార లోపం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, మొష్యా అనితకుమారి, అధ్యాపకులు అంబికా, భవాని, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ డైరెక్టర్ శ్రీనివాస ఫణి చేతుల మీదుగా టూరిజం ఎక్సలెన్ అవార్డు గ్రహీత కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో వై.విజయలక్ష్మిను ప్రిన్సిపాల్ తదితరులు అభినందిచారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న మురళి

ఎటపాక: ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం 2021–22లో మంజూరైన ప్రభుత్వ గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి మురళి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన ఇళ్ల నిర్మాణాలు 2025 మార్చి 31లోగా పూర్తిచేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత

అరకులోయ రూరల్: ప్రభుత్వ మహిళ జూనియర్ కళశాల వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సుజాత చెప్పారు. మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ మహిళ వసతి గృహాన్ని ఆమె గురువారం సందర్శించారు. విద్యార్థులతో సమావేశం నిర్వహించి, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో వసతి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

వసతి గృహంలో మరుగుదొడ్లు, తాగునీరు, రన్నింగ్ వాటర్ పూర్తి స్థాయిలో లేదని, ప్రహరీ లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు.